

రోడ్డుప్రమాద బాధితులకు ఊరట
ఆస్పత్రుల్లో లక్షన్నర వరకు ఉచిత వైద్యం
ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -62 బుధవారం 7 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts





# గాలి జైలుకు

## ఓబులాపురం మైనింగ్ కేసులో తుదితీర్పు

### గాలి జనార్ధన్ రెడ్డి తదితరులకు ఏడేళ్ల జైలు

**ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు**

**సబితను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు**

హైదరాబాద్, **మే6(జర్నలిస్ట్ వార్త):** ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది.



మిగతా 2లో

# యుద్ధం వస్తే సన్నద్ధం



అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పౌరులను, భద్రతా సిబ్బందిని సన్నద్ధం చేయడంలో భాగంగా ఈ మాక్ డ్రిల్స్ చేపడుతున్నారు. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాలైన సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), మౌలాలిలోని ఎన్‌ఎఫ్‌సీలలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ భద్రతా విన్యాసాలు ఏకకాలంలో జరగనున్నాయని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## హోంశాఖ ఆదేశాలతో నేడు మాక్ డ్రిల్

**దేశవ్యాప్తంగా మొత్తం 259 సున్నిత ప్రదేశాలలో ఈ మెగా సెక్యూరిటీ డ్రిల్**

**భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా మాక్ డ్రిల్స్**

**హైదరాబాద్‌లో బుధవారం నాలుగు కీలక ప్రాంతాల్లో విన్యాసాలు**

**సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్, మౌలాలి ఎన్‌ఎఫ్‌సీలో మాక్‌డ్రిల్స్**

**సాయంత్రం 4 గంటలకు మాక్‌డ్రిల్స్ చేపట్టనున్న అధికారులు**

న్యూఢిల్లీ **మే6(జర్నలిస్ట్ వార్త):** : దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంలో బుధవారం కీలక భద్రతా విన్యాసాలు (మాక్ డ్రిల్స్) నిర్వహించనున్నారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పౌరులను, భద్రతా సిబ్బందిని సన్నద్ధం



చేయడంలో భాగంగా ఈ మాక్ డ్రిల్స్ చేపడుతున్నారు. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాలైన సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), మౌలాలిలోని ఎన్‌ఎఫ్‌సీలలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ భద్రతా విన్యాసాలు ఏకకాలంలో జరగనున్నాయని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.దేశవ్యాప్తంగా మొత్తం 259 సున్నిత ప్రదేశాలలో ఈ మెగా సెక్యూరిటీ డ్రిల్ నిర్వహించేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మాక్ డ్రిల్స్ నిర్వహణపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

మిగతా 2లో

# ఆర్టీసీ సమ్మె వాయిదా

- తెలంగాణలో ప్రయాణికులకు ఊరట..
- ఆర్టీసీ సమ్మెను తాత్కాలిక వాయిదా వేసిన కార్మికులు
- మంత్రి పొన్నంతో ఆర్టీసీ జేఏసీ నాయకుల భేటీ
- ఆర్టీసీ సమస్యలపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు




హైదరాబాద్, **మే6(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.వివరాల్లోకి వెళితే, తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మే 6వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రభుత్వం నుంచి చర్చలకు ఆహ్వానం అందకపోతే, మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని వారు స్పష్టం చేశారు.

మిగతా 2లో

# కొత్త రేషన్ కార్డుల జారీకి నేటి నుంచి దరఖాస్తులు

**క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డుల జారీ**

**-మార్పులు,చేర్పులకు కూడా అవకాశం: నాదెండ్ల**

అమరావతి **మే6(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2లో




# మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధం

**సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న నగరం**

**అందాల పోటీలు తెలంగాణకు గర్వమన్న జూపల్లి**

**తెలంగాణ సంప్రదాయం నచ్చిందన్న మిస్ ఇండియా**






# మన జలాలు మనకే

**సింధు జలాలు ఇప్పటి వరకు దేశం దాటి వెళ్లేవి**

**ఇకపై భారతీయుల ప్రయోజనాలు కోసమే**

**అవి మన భూభాగంలో పారుతాయి**

**ప్రధానమంత్రినరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : "సింధునదీ జలాలు ఇదివరకు దేశం దాటి వెళ్లేవి. ఇప్పుడు బయటకు వెళ్లకుండా దేశ ప్రయోజనాలకే వినియోగమవుతాయి" అని ప్రధాని మో డీ మంగళవారం స్పష్టం చేశారు. ఎబిపి న్యూస్ ఈవెంట్‌లో పాల్గొన్న మోడీ పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. మీడియాలో ఈ మధ్య జలాలపై జోరుగా చర్చ సా గుతోందని, గతంలో భారతీయ హక్కులు విదేశాల్లో ఉప్పొంగేవని, కానీ ఇక ముందు భారతీయ భూభాగంలో పారే జలాలు ఇక్కడి ప్రజల ప్రయోజనం కో సం, వారి పురోగభివృద్ధి కోసమే మన భూభాగంపైనే ఉప్పొంగి ప్రవహిస్తాయ ని అన్నారు.

# 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్లు

**ఆర్ఆర్ఆర్ దక్షిణభాగానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

**రేడియల్ రోడ్ల పనుల ప్రక్రియను వేగవంతం చేయాలి**

**శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లు ఉండాలి**

**ట్రాఫిక్ సిగ్నళ్లు లేకుండా రోడ్డు దాటే ఏర్పాట్లుండాలి**

**ఆర్అండ్‌బీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్**



హైదరాబాద్, **మే6(జర్నలిస్ట్ వార్త):** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం అలైన్‌మెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పొరపాట్లకు తావివ్వొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మార్గంలో అటవీ ప్రాంతం, జల వనరులు, మండల కేంద్రాలు, గ్రా మాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, వాటికి సంబంధించి జంక్షన్లు, అనుసంధానం ఉండాలని సూచించారు. శాటిలైట్ టౌన్‌షిపలు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లకు రూపకల్పన చేయాలన్నారు. మంగళవారం ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ బయటకు వెళ్లే ప్రాంతంలో అవసరమైన స్థాయిలో ట్రంపెట్‌లు నిర్మించాలని, ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నళ్లు లేకుండా రోడ్డు దాటేలా ఉండాలని సూచించారు.

# ఉద్యోగులు, ప్రజల మధ్య సిఎం చిచ్చు

**మేనిఫెస్టోలో చెప్పిందే అడుగుతున్నారు అడ్డగోలు హామీలు ఇచ్చి ఇప్పుడు తప్పించుకునే యత్నం**

**రేవంత్‌వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపం తెలంగాణ దివాలాతీస్తే మీ కుటుంబ ఆస్తులు ఎలా పెరిగాయి?**

**కెసిఆర్‌నుదూషిస్తే నాలుక చీరేస్తాం**

**: బిఆర్ఎస్ అగ్రనేత కెటిఆర్**



# కొత్త రేషన్ కార్డుల జారీకి నేటి నుంచి దరఖాస్తులు

## క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డుల జారీ -మార్పులు,చేర్పులకు కూడా అవకాశం: నాదెండ్ల

(మొదటి పేజి తరువాయి) ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12 నుంచి



దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు. రేషన్ కార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు అవకాశం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వేరే ప్రాంతానికి వలస వెళితే రేషన్ కార్డులను సరెండర్ చేయొచ్చని సూచించారు. ఇక, కొత్త రేషన్ కార్డులని స్మార్ట్ కార్డు తరహాలో ఇస్తున్నాం అని తేల్చి చెప్పారు. కొత్త డిజైన్ చేసి రేషన్ కార్డు ఇస్తున్నాం.. అని మనోహర్ పేర్కొన్నారు.అయితే, గ్రామ వార్డ్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల చెప్పారు. జూన్ లో అందరికి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తడిసిన ధాన్యం ఖచ్చితంగా కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

# గాలి జైలుకు




(మొదటి పేజి తరువాయి)
ఈ కేసులో అప్పటి గనులశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డితో సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' అనే పొలిటికల్ పార్టీని స్థాపించి 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గాలి జనార్దన్ రెడ్డి గంగావతి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీలో చేరిపోయారు. అయితే.. సీబీఐ కోర్టు వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం కూడా ఉంది. ఇకపోతే ఓఎంసీ కేసులో గాలి జనార్దన్ రెడ్డి ఇప్పటికే కొంత కాలం జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కేసులో విచారణ దాదాపు 13 ఏళ్లకు పైగానే సాగింది.
3,,400 డాక్యుమెంట్లను పరిశీలించి, 219 మంది సాక్ష్యులను విచారించి.. కర్ణాటక ఫారెస్ట్ ల్యాండ్స్‌లో గాలి బ్రదర్స్ మైనింగ్ తవ్వకాల వల్ల 884.13 కోట్ల రూపాయలను రాష్ట్రం నష్టపోయిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించడం గమనార్హం. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు- సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు- గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. మొత్తంగా ఈ కేసునుంచి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# యుద్ధం వస్తే సన్నద్ధం

(మొదటి పేజి తరువాయి)
ఈ సమావేశంలో, దాడులకు అవకాశం ఉన్న ప్రాంతాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం నగరాలు కేటగిరీ-2లో ఉన్నాయి
భారత్-పాకిస్థాన్ సరిహద్దులో భారత వాయుసేన బుధవారం మాక్ డ్రిల్స్ మొదలు పెట్టనుంది. ఇందులో రఫేల్, మిరాజ్ 2000, సుఖోయ్-30 వంటి అన్ని రకాల యుద్ధవిమానాలు పాల్గొననున్నట్లు- వాయుసేన అధికారులు వెల్లడించారు. దాదాపు ఐదున్నర గంటలపాటు- ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. దీంతో సరిహద్దు ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచన మేరకు సంక్షోభ సమయంలో పౌరులు వ్యవహరించాల్సిన తీరుపై దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టనున్నారు. ఇదే సమయంలో భారత వాయుసేన కూడా రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో భారీస్థాయిలో విన్యాసాలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పైలట్లకు ఇచ్చే సమాచారాన్ని వాయుసేన జారీ చేసింది. మరోవైపు శత్రుదేశం దాడులు చేస్తే సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. వైమానిక దాడులు, బాంబు దాడులు జరిగితే ఎలా రక్షించుకోవాలో ప్రజలు, విద్యార్థులకు తెలియజేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఈ డ్రిల్స్ చేపడతారు.

# మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధం

హైదరాబాద్, **మే6(జర్నలిస్ట్ వార్త):** :-మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పోటీల్లో పాల్గొనేందుకు అందాలభామలు భాగ్యనగరానికి చేరుకుంటున్నారు. వందకు పైగా దేశాల నుంచి వచ్చే సుందరీమణులకు స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మిస్‌వరల్డ్ పోటీలపై హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వర్లడ్ సీఈవో జూలియా, మిస్‌ఇండియా వరల్డ్ నందిని గుప్తా, పటేల్ రమేశ్ రెడ్డి, జయేశ్ రంజన్, సోనూసూద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు జరగడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీల కోసం వస్తున్న ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభూతిని పంచేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మిస్ వరల్డ్ గ్లోబల్ యూనిట్‌కి వేదిక అన్న ఆయన.. మన రాష్ట్ర సంప్రదాయం, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇదో చక్కని అవకాశమన్నారు. పర్యాటకశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆహారం, సంస్కృతి, పర్యాటకాన్ని ప్రపంచానికి చాటేందుకు ఈ పోటీలు దోహదం చేయనున్నాయన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకొనేందుకు ఇదో మంచి అవకాశం. అందరం కలిసి ఈ పోటీలను విజయవంతం చేయాలి. వీవీఐపీల కోసమే అందాల పోటీలు అనే అభిప్రాయం లేకుండా సామాన్యులు సైతం హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఈ పోటీలను తిలకించాలనే ఆసక్తి ఉన్నవారు పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జయేశ్ రంజన్ సూచించారు.ఇండియా మిస్ వరల్డ్ 2025 పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా తనను హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్ కట్టి పడేశాయని తెలిపారు. తనకు తెలంగాణ ఎంతగానో నచ్చిందని, ఇక్కడ గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో ఫాస్ట్ గా డెవలప్ అవుతున్న సిటీ- హైదరాబాద్ అని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన నందిని గుప్తా.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుసుకుని సంబురపడ్డారు. ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలు, ఆలయాలు, పర్యాటక స్థలాలను సందర్శించారు. పోచంపల్లి హ్యాండ్లూమ్స్ తనకు ఎంతో నచ్చాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. యాంగస్ట్ స్టేట్ అయినా కూడా ఇక్కడ హాస్పటాలిటీ బాగుందని కొనియాడారు. 'అందరికీ నమస్కారం.. తెలంగాణకు తప్పకుండా రండి..' అంటూ తెలుగులో మాట్లాడారు నందిని గుప్తా. తెలంగాణ గురించి మాట్లాడిన ప్రతిసారి తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని మిస్ ఇండియా నందిని గుప్తా అన్నారు. ఇక్కడి సంస్కృతి, అభివృద్ధి ఎంతో గొప్పగా ఉంటాయన్నారు. హైదరాబాద్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్న ఈ అందాల భామ.. ఇక్కడి ప్రజలు ప్రేమను పంచుతున్నారన్నారు. హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు ఆహారం అద్భుతంగా ఉటుందని చెప్పారు. పోటీ-ల్లో పాల్గొనే ప్రతి యువతి ఒక గొప్ప లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని చెప్పారు.

# ఆర్టీసీ సమ్మె వాయిదా

(మొదటి పేజి తరువాయి
ఈ నేపథ్యంలో సోమవారం నాడు కార్మికులు భారీ కవాతు నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రభుత్వం చొరవ తీసుకుని జేఏసీ నేతలను చర్చలకు ఆహ్వానించింది.మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నేతలు జరిపిన సమావేశంలో కార్మికుల సమస్యలు, డిమాండ్లపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా, ఉద్యోగుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార మార్గాలను సూచించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో నవీన్ మిట్టల్, లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్ సభ్యులుగా వ్యవహరిస్తారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఈ కమిటీ చర్చలు జరిపి, వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించడం, సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడంతో జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ నివేదిక వచ్చే వరకు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు వారు ప్రకటించారు. ప్రభుత్వ చర్యతో ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమ్మె నిర్ణయం తాత్కాలిక వాయిదా మాత్రమేనని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రత, ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల అంశం, కారుణ్య నియామకాలు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని జేఏసీ నేతలు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంతకాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# మెట్రో ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం

## నష్టాల నుంచి అధిగమించేందుకు చర్యలు

హైదరాబాద**మే6(జర్నలిస్ట్ వార్త):** :హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలను పెంచే అవకాశాలపై తాజాగా సంకేతాలు వెలువడ్డాయి. మెట్రో వర్గాల సమాచారం ప్రకారం, మే రెండో వారంలో సవరించిన టికెట్ రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ- గ్రూప్ ఛైర్మన్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన భారత్‌కు చేరిన తర్వాతే ఛార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ టారిఫ్ సవరణలతో వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు ఆదాయం పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఛార్జీలు పెంచే అంశంపై ఇప్పటికే సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మెట్రోలో కనిష్ఠ టికెట్ ఛార్జీ రూ.10 కాగా, గరిష్ఠ ఛార్జీ రూ.60గా ఉంది. ఈ గరిష్ఠ ధరను రూ.75 వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం, మెట్రో రైలు సేవలతో పాటు ప్రకటనలు, షాపింగ్ మాల్స్ అద్దె లాంటి ఇతర మార్గాల ద్వారా మెట్రో సంస్థ ఏటా సుమారు రూ.1500 కోట్ల ఆదాయాన్ని నమోదు చేస్తోంది. అయితే మెట్రో నిర్వహణ, ఉద్యోగుల జీతాలు, బ్యాంకు రుణాల వడ్డీలు వంటి ఖర్చులతో కలిపి సంస్థకు వార్షికంగా సుమారు రూ.2000 కోట్ల వ్యయం జరుగుతోందని వర్గాలు తెలిపాయి.

# ఉద్యోగులు, ప్రజల మధ్య సిఎం చిచ్చు

హైదరాబాద్ **మే6(జర్నలిస్ట్ వార్త):**
రేవంత్ వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపం తెలంగాణ ప్రతిష్ట దెబ్బతినేలా మాట్లాడితే సహించేది లేదు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపాటు
మనతెలంగాణ/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత వ్యాఖ్యలతో ఉద్యోగులు, ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందే ఉద్యోగులు అడుగుతున్నారని, కానీ సిఎం ఉద్యోగులను ప్రజల ముందు ఉద్యోగులను విలన్‌లుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తారనే నమ్మకం లేక అడ్డగోలుగా హామీలు ఇచ్చారని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బిఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల త్యాగాల గురించి ముఖ్యమంత్రికి ఇసుమంత కూడా తెలియదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ ఎన్‌జిఒల త్యాగాల స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని తెలిపారు. ఉద్యోగాలు పోయినా.. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగులపై సిఎం రేవంత్ రెడ్డి మాటలు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపంగా మారాయని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీని, తమను ఎన్ని తిట్టినా భరించామని, కానీ తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినేలా సిఎం మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అత్యంత అసమర్థ, దక్షతలేని సిఎం అని ఆయన సోమవారం చేసిన వ్యాఖ్యలతో తేలిపోయిందని విమర్శించారు. ఆదాయం పెరిగిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో



పెట్టామని తెలిపారు. కానీ పరిపాలన చేతకాదని.. సిఎం రేవంత్‌రెడ్డి కాడి కిందపడేశారని విమర్శించారు. నాయకత్వ లోపం.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పెట్టిన శాపం అని పేర్కొన్నారు.

దొంగ కాబట్టే దొంగ అని అంటున్నారు

రేవంత్‌రెడ్డి దొంగ కాబట్టే దొంగ అని అంటున్నారని కెటిఆర్ అన్నారు. నోట్ల కట్లతో దొరికిన రేవంత్ రెడ్డిని దొంగ కాక మరేంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి దొంగ కాబట్టే.. అప్పు పుట్టడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ లాంటి ఎర్రి పార్టీ.. దొంగ చేతికి తాళాలు ఇచ్చిందని అన్నారు. రేవంత్ రెడ్డిని సిఎం చేసి..ఎఐసిసి, రాహుల్ గాంధీ చాలా పెద్ద తప్పు చేశారని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి కుటుంబం ఆస్తులు ఎలా పెరిగాయి..?

ఏడాదిలోనే సిఎం రేవంత్‌రెడ్డి కుటుంబం ఆస్తులు ఎలా పెరిగాయని కెటిఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఫోర్త్ సిటీలో 2 వేల ఎకరాలు ఎలా కొన్నారని, రాష్ట్రం దివాలా తీస్తే అనుముల కుటుంబ ఆస్తులు ఎలా పెరుగుతున్నాయని నిలదీశారు. రేవంత్ రెడ్డి తమ్ముడు రూ.వెయ్యి కోట్లతో స్వచ్ఛ బయో అనే కంపెనీ పెట్టారని, ఆయన అల్లుడు లగచర్లలో ఫార్మా కంపెనీ పెట్టేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ఒకవైపు దివాలా కోరు మాటలు.. మరోవైపు తెలంగాణ రైజింగ్ అంటున్నారని, ఇందులో ఏది వాస్తవం అని అడిగారు.

కెసిఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే నాలుక చీరేస్తాం

తమ అధినేత కెసిఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే ఇప్పటివరకు సహించామని, ఇకపై కెసిఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే రేవంత్ రెడ్డి నాలుక చీరేసే పరిస్థితి వస్తుందని కెటిఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి సోదరుల అరాచకాల వలనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. అడ్డమైన మాటలు బంద్ చేసి.. రేవంత్ రెడ్డి బుర్ర పెంచుకోవాలని సూచించారు

# 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్లు

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను పరిశీలించి పలు మార్పులు సూచించారు.
హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి కూడా సీఎం పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలని సూచించారు. ఈ కొత్త రహదారులకు సంబంధించి జాతీయ రహదారుల విభాగం అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సమీక్షలో ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# మన జలాలు మనకే

దశాబ్దాల నాటి సింధుజలాల ఒప్పందం రద్దు అయిన తరువాత బహిరంగంగా దానిపై మోడీ వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి.తమ ప్రభుత్వం గత పదేళ్లలో దేశ ప్రయోజనాల కోసం అనేక కఠినమైన నిర్ణయాలు తీసుకుందని, కా నీ గత ప్రభుత్వాలు ఈ విధంగా దృఢమై న నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేశాయని వ్యాఖ్యానించారు. ఏదైనా ము ఖ్యమైన నిర్ణయం తీసుకునేటప్పుడు ప్ర పంచం ఏం ఆలోచిస్తోందో అని ప్రజలు యోచిస్తుంటారని పేర్కొన్నారు. గత ప్ర భుత్వాలు నిర్ణయం తీసుకునే ముందు తాము ఓట్లు పొందగలుగుతామా లేదా తమ పదవి పదిలమా లేదా అని ఆలోచించేవని అందువల్లనే ముఖ్యమైన సం స్కరణలు ఆలస్యమయ్యేవని విమర్శించారు. ఈ విధంగా ఏదేశం ముందుకు వెళ్లలేదని ప్రధాని పేర్కొన్నారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను
# వెలికి తీసేందుకు కృషి చేయాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద**





**వర్ధన్నపేట/మే6(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు వేసవిలో సమయాన్ని వృధా చేసుకోకుండా క్రమశిక్షణను అలవర్చుకొని చదువుతోపాటు , కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సత్య శారద కోరారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల, వర్ధన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులను కలెక్టర్ సత్య శారద, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రామ్ రెడ్డి, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, ఎంపీడీవో వెంకటరమణలతో కలిసి సందర్శించారు. వర్ధన్నపేట జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చెస్ ఆడుతుంటే వారితో ముచ్చటించారు. కట్ర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన యోగా ఆసనాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు వేసవిలో సమయాన్ని వృధా చేసుకోకుండా క్రమశిక్షణను అలవర్చుకొని చదువుతోపాటు , కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని సూచించారు. డాన్స్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథమెటిక్స్ స్కిల్స్ ,ఆర్ట్ క్రాఫ్ట్, జీవన నైపుణ్యాలలో మేలుకువలు ఎంతో అవసరం అన్నారు. ప్రతి విద్యార్థిలో అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసినప్పుడే ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తారని అన్నారు. వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని విద్యార్థులను కోరారు . ఈ కార్యక్రమంలో ఎంపీఓ ధనలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగా అనిల్ కుమార్ పర్వత రమణారావు, బరిగల దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ సదస్సు సందర్శించిన ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య



**వర్ధన్నపేట/మే 6(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో మంగళవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును వర్ధన్నపేట ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యం, జిల్లా నాయకులు పోశాల వెంకన్న సందర్శించి, రెవెన్యూ సదస్సు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలుపై వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఏంపిక చేయడం జరిగిందన్నారు. వరంగల్ జిల్లాల్లో 12 మండలాలు ఉన్నప్పటికీ వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ప్రత్యేక చోరువతో వర్ధన్నపేట మండలం పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక అయిందని చెప్పారు. ప్రజాకోణంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాబడిన ఆయా మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించడమే ఈ రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య అన్నారు. రెవెన్యూ సదస్సులలో రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు సమాధానం ఇచ్చారు. రైతులకు భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయికి తీసుకుపోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశం అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలు తలెత్తయన్నారు. వాటి కారణంగా ఎంతోమంది రైతు కుటుంబాలు సమస్యలను ఎదురీదుతూనే ఉన్నారని అన్నారు.గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వల్ల రైతులు ఇప్పటికీ అవస్థలు పడుతున్నారని తెలిపారు. ధరణి ప్రజల జీవితాలు ఆగం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టారని అన్నారు.

# పర్వతగిరిలో మామిడి తోటలకు భారీ నష్టం

**- వడ్లకొండ, కల్లెడల్లోనూ తీవ్ర ప్రభావం**

**- జిల్లా అధికారులకు నివేదిక ఇస్తానన్న ఉద్యాన అధికారి తరుణ్**




**పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త):** మండలంలో సోమవారం రాత్రి వీచిన తీవ్రమైన గాలులు, వర్షం కారణంగా మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కరిమిల్ల సోమేశ్వర రావు, పెన్నింటి అశోక్ రావు, పెన్నింటి సునీల్ రావులకు, పెన్నింటి అనిల్ రావు చెందిన తోటలతో పాటు, వడ్లకొండ, కల్లెడ గ్రామాల్లోని మామిడి తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.పెద్ద సంఖ్యలో మామిడి కాయలు నేలరాలాయి. బలమైన గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్న సమయంలో ఈ అకాల వర్షం, గాలులు బీభత్సం సృష్టించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన మామిడి తోటలను ఉద్యాన శాఖ అధికారి తరుణ్ మంగళవారం పరిశీలించారు. పర్వతగిరితో పాటు వడ్లకొండ, కల్లెడ గ్రామాల్లోని దెబ్బతిన్న తోటలను ఆయన స్వయంగా చూసి నష్టం యొక్క తీవ్రతను అంచనా వేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, నష్టం యొక్క సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని హామీ ఇచ్చారు.పంట చేతికి వచ్చే తరుణంలో ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో మామిడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

# ధరణిలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు



**పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ము తండ గ్రామపంచాయతీ ధరావత్ హేమ్లి, ధరావత్ చక్రి లకు వారసత్వంగా రావలసిన భూమిని గతంలో ధరణి ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన చట్టం ద్వారా పూర్తి విచారణ చేసి తమ భూమి తమకు అప్పగించాలని గతంలో ధరణి ద్వారా అన్యాయంగా చేసుకున్న రిజిస్ట్రేషన్ రద్దుచేసి భూభారతి చట్టం ద్వారా మా భూమి మాకు ఇప్పించాలని స్థానిక ఎమ్మార్వో వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు.

**త్వరలో నూతన చట్టం ద్వారా వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్-ఎమ్మార్వో వెంకటస్వామి**

వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే మా పరిధిలో విచారణ చేసి హక్కుల రికార్డులో మ్యుటేషన్ ను పరిగణంలోకి తీసుకుంటాం.మ్యుటేషన్ భూ భారతి పోర్టల్లో నిర్దేశించిన నమూనాలో దరఖాస్తుతో పాటు వారసుల ఒప్పంద పత్రం లేదా వీలునామా కాపీ ఉండాలి.వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ సెక్షన్ 7, రూల్ 7 & షెడ్యూల్ – బి ద్వారా నూతన భూభారతి చట్టం ద్వారా చేయవచ్చు. అభ్యంతరాలు ఉంటే రెవిన్యూ డివిజనల్ అధికారికి, ఆపై జిల్లా కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చు.

# నర్సరీలలో జాగ్రత్తలు వహించాలి




**పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త):** సోమవారం రాత్రి భారీగా వచ్చిన ఈదురు గాలుల వలన మండలంలోని నర్సరీలపై వేసిన షెడ్ నెట్లు చల్లాచెదురు అయినందున మంగళవారం ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాసులు పర్వతగిరి మండల నర్సరీని సందర్శించి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు షేడ్ నెట్ లను సరి చేసుకోవాల్సిందిగా సూచనలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా కాంపోస్టు షెడ్డు సందర్శించి కాంపోస్టు తయారీ విధానాన్ని చేయుటకు సూచనలు ఇవ్వడం జరిగింది.

# రెండు కన్నులవలే సాగుతున్న ప్రజా ప్రభుత్వ పాలన

**-వర్షాకాలంలోపు గ్రామాలలో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు పూర్తి -భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

**కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి**





**ఖమ్మం/మే6(జర్నలిస్ట్ వార్త):** సంక్షేమం, అభివృద్ధి రెండు కన్నులా ప్రజా ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి, కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

కూసుమంచి మండలం నేలపట్ల గ్రామం ఎస్సీ కాలనీలో 24 లక్షలతో, మల్లేపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో 36 లక్షలు, జక్కేపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో 20 లక్షలు అంచనా విలువతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు,15 కోట్ల అంచనా వ్యయంతో పాలేరు పట్టణ పరిధిలో సూర్యాపేట– అశ్వరావుపేట రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులు సైతం చేపట్టామని, పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. నేలపట్ల గ్రామంలో పెండింగ్ అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు వర్షాకాలంలోపు పూర్తి చేస్తామని, ఇండ్లపై నుంచి వెళ్తున్న హై టెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించే కార్యక్రమం చేపట్టామని, గ్రామాల మధ్య లింక్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నామని, సాగునీరు అందించే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం రేషన్ ద్వారా నిరు పేదలకు ఉగాది నుండి సన్న బియ్యం సరఫరా చేస్తుందని, ఇందిరమ్మ కమిటి అందించిన జాబితా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతలో నిరుపేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని, యాసంగి సీజన్ లో కూడా రైతులకు బోనస్ చెల్లిస్తామని అన్నారు.రైతులకు ఉన్న భూ సమస్యలను అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ నిరుపేదలకు ఇచ్చిన భరోసా ప్రకారం చిత్తశుద్ధితో పనిచేస్తామని, ఇచ్చిన ప్రతి మాటను పేదవానికి చేర్చడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏడిఏ సరిత, కూసుమంచి మండల తహశీల్దార్లు కరుణశ్రీ, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడవ రోజుకు చేరుకున్న భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు







**వరంగల్/మే 6(జర్నలిస్ట్ వార్త):** భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం 7వ, రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం గం: 04–00లకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన తర్వాత అమ్మవారికి బలి ఉత్సవం నిర్వహించారు. ఈ రోజు ఉభయదాతలైన హనుమకొండ నాయిబ్రాహ్మణ సంఘం వారి ఆహ్వానం మేరకు అనేక మంది నాయి బ్రాహ్మణులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పట్టుబట్టలు, పూలు, పండ్లు అన్నీ శిరస్సు మీద ధరించి మేళతాళాలతో వేదమంత్రాలతో గుడిలోనికి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి శోడషోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞ గైకొని స్నపనమండపంలోకి వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం 500 మంది నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపబడింది. ఆ తర్వాత గ్రహమఖం, దుర్గాహెరీమం, లక్ష్మి హెరీమాదులు జరుపబడ్డాయి. అటుపిమ్మట అమ్మవారికి అమ్మవారికి బలి ఉత్సవం నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగవెల్లి సరేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని ఆలయ ఈ.ఓ శేషు భారతి తెలిపారు. ఆలయానికి విచ్చేసిన సుమారు 2000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి, అతిథులుగా సూర్యపల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు డా: బండారు జగదీష్ బాబు, గౌరవ సలహాదారులు తూముల సాంబయ్య, డా: జీవనాథ్, కమిటీ సభ్యులు కరిమిల్ల రమేష్, శ్రీరాముల రమేష్, శ్రీరాముల నరేందర్, జగన్, సురేష్, శివ, సతీష్, మధుసూదన్, జిల్లాల వారీగా అనేక మంది నాయీబ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, చల్లని త్రాగునీరు, అమ్మవారి దర్శనం తదితర ఏర్పాట్లను ఆలయ ఈ.ఓ పర్యవేక్షించారు. సాయం కాలం అమ్మవారికి అర్చనాదులు, సాయం ఔపాసన, దీక్షా హెరీమం, బలిహరణ జరుపబడిన అనంతరం అమ్మవారిని భద్రకాళి మహాత్రిపుర సుందరిగా అలంకరించి రథసేవ జరిపారు. ఈ రథసేవలో వందలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ఆహ్లాదకరమైన ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో అమ్మవారి గుడిలో ఈ రథసేవ జరుగుతున్నంత సేపు భద్రకాళి శరణం మమ అనే నామ స్మరణతో దేవాలయ ప్రాంగణమంతా మారుమోగింది.

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చెయ్యాలి





## -వైద్యాధికారి డాక్టర్ సరోజ

**చెన్నారావుపేట/మే6(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందించవలసిన సేవల గురించి వివరించడం జరిగినది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరినారు. అనవసరమైన శస్త్రచికిత్సలు చేయకుండా సాధారణ ప్రసవాలు జరిగేటట్లు ప్రోత్సహించాలి అని సూచించారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని కోరారు. క్యాన్సర్, పాలియాటివ్ కేర్ సర్వేలో గుర్తించిన వారికి సేవలు అందించాలని .ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగు చికిత్సల. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరియు పల్లె దవఖానాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని .వైద్యాధికారులు , సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేయడం జరిగి%శీ%ది. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు, వడదెబ్బ గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని, ఎండ దెబ్బకు గురి అయిన వారికి ప్రథమ చికిత్స చేయాలని, ఎలాంటి వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలన్నారు . ఎండాకాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో మరియు ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఓ ఆర్ ఎస్ కార్నర్ పెట్టాలన్నారు .డిప్యూటీ డెమో అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ఆరోగ్య కార్యకర్తల సమన్వయతో పనిచేసి మంచి ఫలితాలు రాబట్టాలని ఉన్నతమైన సేవలందించాలని కోరినారు.సఖి సిబ్బంది వారు అందించు సేవలపై వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో సహకరించి అవసరమైన వారికి సేవలందించాలని సూచించారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సి హెచ్ ఓ భద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత ఆరోగ్య పర్యవేక్షకులు ప్రేమలత, సువార్త , సఖి సిబ్బంది స్వప్న కేస్ వర్కర్, శోభారాణి లీగల్ కౌన్సిలర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముందస్తుగా సై టీబి పరీక్షలు చేసుకోవాలి

## -వైద్యాధికారి డాక్టర్ ఐ రత్న మనోహర్

**తల్లాడ/మే6(జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి సై టీబి పరీక్షలు వైద్యాధికారి డాక్టర్ ఐ రత్న మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నిత్యం క్షయ వ్యాధిగ్రస్తుల మధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎవరికైనా టీబి వ్యాధి ఉన్నది లేనిది నిర్ధారణ కోసం ఈ యొక్క పరీక్ష నిర్ధారిస్తుందన్నారు.ప్రజలు తమ కుటుంబ సభ్యులలో ఎవరికైనా క్షయ వ్యాధి ఉన్నట్లయితే ఆ కుటుంబ సభ్యులకు కూడా వ్యాధి సోకకుండా ముందుగానే ఈ యొక్క పరీక్షను చేయించుకున్నట్లయితే వ్యాధి నీ నిర్ధారించి వెంటనే చికిత్స ప్రారంభించినట్లయితే సులభవంతంగా వ్యాధిని నివారణ చేసుకోవచ్చు కావున క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న కుటుంబ సభ్యులు అందరూ స్వచ్ఛందంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య



కేంద్రమునకు వచ్చి యొక్క పరీక్షలు చేయించుకోవలసినదిగా వైద్యాధికారి తెలిపారు. ఆశా కార్యకర్త సమావేశంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వివాహ వయసు బాలురకు 25 సంవత్సరాలు, బాలికలకు 21 సంవత్సరం నిండిన తర్వాతనే వివాహం జరిపించవలసినదిగా తల్లిదండ్రులకు తెలుపలన్నారు . చిన్న వయసులో అమ్మాయిలకు వివాహం జరగటం వల్ల వారిలో శారీరక ఎదుగుదల ఉండదని , అబార్షణలు జరుగుతాయని, పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉండరు అని,భార్యాభర్తల మధ్య సరియైన అవగాహన లోపిస్తుందని, చిన్నతనంలో పెళ్లి చేసుకోవడం వల్ల ఆర్థికంగా స్థిరపడకపోవడం వల్ల అనేక సమస్యలకు లోను కావలసి వస్తుందన్నారు. యువతి యువకులకు నిర్దేశిత వయసు వచ్చిన తర్వాత మాత్రమే వివాహాలు జరిపించాలని ఆశా కార్యకర్తలకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భాస్కర్ హెల్త్ సూపర్వైజర్స్ పెద్ద పుల్లయ్య భద్రమ్మ ,ఝాన్సీ లక్ష్మి టీబి సూపర్వైజర్స్ సురేష్ సంజీవ్ కుమార్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# సంజీవని ఆశ్రమం లో వేసవి శిక్షణ శిబిరం దిగ్విజయం

**నర్సంపేట/మే6(జర్నలిస్ట్ వార్త):**
ఉచిత వేసవి శిక్షణ శిబిరం, నర్సంపేట లోని సంజీవని ఆశ్రమంలో జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా దిగ్విజయంగా నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సంజీవని ఆశ్రమం నిర్వాహకులు డాక్టర్ మోహన్ రావు హాజరై మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రతి యెడు ఏదో ఒక కొత్త తరహాలో పిల్లలకు శిక్షణ ఇచ్చి మంచి నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారని తెలిపారు. శిక్షణ వల్ల మా విద్యార్థులు అద్భుతమైనటువంటి ప్రతిభ పాటవాలను పెంపొందించు కోవడమే కాకుండా కార్యరూపం దాల్చడం చాలా అభినందనీయం అన్నారు. జె. వి.వి .వారు చేసే సేవలు ఎంతగానో కొనిఆడదగినవి అని అన్నారు. జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షులు మోతే ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మేము పడ్డ శ్రమకు ఫలితం విద్యార్థుల్లో కనబడుతుందన్నారు. విద్యార్థులకు



ఎటువంటి కార్యక్రమాన్ని అయినా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. జన విజ్ఞాన వేదిక జనరల్ సెక్రెటరీ సుధాకర్ మాట్లాడుతూ పిల్లలు మొదటి నుంచి చివరి వరకు ఎంతో ఆసక్తిగా, ఓపికతో వింటూ శిక్షణలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట, రోజుకు రెండు గంటలు అనుకున్నా శిక్షణ తరగతులను, విద్యార్థుల ఆసక్తి చూసి ఉదయం,మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటల కార్యక్రమాలు నిర్వహించడం మాకెంతో ఆనందదాయకమన్నారు. పిల్లల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని స దూర ప్రాంతాల నుండి రిసోర్స్ పర్సన్స్ లను తీసుకువచ్చి శిక్షణ తరగతులు ఇప్పించడం జరిగిందన్నారు. ఐదు రోజుల శిక్షణ శిబిరాల్లో చురుగ్గా,మెరుగ్గా పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది. వరంగల్ జిల్లా సంస్కృతిక కన్వీనర్ సిహెచ్ యాకయ్య పిల్లలుదేశించి సైన్సు సంబంధిత గీతాలు ఆలపించడం జరిగింది. నర్సంపేట మండల జనరల్ సెక్రెటరీ బూరుగు నవీన్ వందన సమర్పణ చేస్తూ ఉచిత సైన్సు సమ్మర్ క్యాంపుకు విచ్చేసి, విద్యార్థిని విద్యార్థులకు ఆశీస్సులు అందజేసిన ముఖ్య అతిధులు నర్సంపేట మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య, టౌన్ సిఐ రఘుపతి, నర్సంపేట నగరపాలక కమిషనర్ నాగరాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పరిశీలకులు శ్యామ్, శిక్షణ తరగతుల నిర్వహణకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్ సైన్స్ ప్రయోగాలపై నిపుణులు సురేష్, ఒరేగామి బిక్షపతి, కమ్యూనికేషన్ స్కిల్స్,పర్సనాలిటీ డెవలప్మెంట్ విషయ నిపుణులు పెండం భాస్కర్, డ్రాయింగ్, పెయింటింగ్ కళల నిపుణులు రాధాకృష్ణ, సంస్కృతిక కళలు, నృత్యాలు గుగులోత్ సుధాకర్ , సంగీత కళపై యాకయ్య, మిమిక్రీ ఇంద్రజాల ప్రదర్శనలిచ్చి కడుపుబ్బ నవ్వించిన బాబర్, జె.వి.వి. వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ జయుడు, చెకుముకి కన్వీనర్ ఎండి రాయబోస్ అదేవిధంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహించుటకు అవకాశం ఇచ్చిన మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్ రావు దంపతులకు, వారి యాజమాన్యానికి, శిక్షణ శిబిరం సంపూర్ణం కావడానికి సహకరించిన రామమ్మా, వార్డెన్ మౌనిక విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

## - ఎంఎల్ సి తాత మధుసూదన్, మాజీ ఎంఎల్ఏ సండ్ర.

**సత్తుపల్లి/మే6(జర్నలిస్టు వార్త):** 09వ తారీఖున జరగబోవు కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంఎల్ సి తాత మధుసూదన్, మాజీ ఎంఎల్ఏ సండ్ర అన్నారు. మంగళవారంతల్లాడ మండలం కొత్త మిట్టపల్లి గ్రామంలో సత్తుపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మే నెల 09వ తారీఖున కేటీఆర్ సభ కొరకు ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశమునకు హాజరైన ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వర రావు హాజరై నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, 09వ తారీఖున జరగబోవు కేటీఆర్ సభను విజయవంతం చేయాలని, పార్టీ కార్యకర్తలకు మార్గ నిర్దేశకాలు చేశారు. తదుపరి ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ తో కలిసి హెలిపాడ్ స్థలమును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో



జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్, కల్లూరు మండల మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, తల్లాడ మండల పార్టీ అధ్యక్షులు దుగ్గిదేవర వెంకట్ లాల్, పెనుబల్లి మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, మాజీ తల్లాడ



మండల ఎంపీపీ దొడ్డా శ్రీనివాస్, నాయకులు లక్కినేని రవి, భాస్కర్ రావు, దిరిశాల దాసు రావు, కేతినేని చలపతి రావు, మువ్వా మురళీధర రావు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇస్నేపల్లి వెంకటేశ్వర్లను పరామర్శించిన పొంగలేటి ప్రధాన అనుచరుడు నారపోగు వెంకట్

## -10 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేత



**తల్లాడ/మే6(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు ( పెద్దోడు), హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్ నందు న్యూరో సర్జన్ ఆపరేషన్ చేసుకొన్న విషయాన్ని తెలుసుకున్న పొంగలేటి ప్రధాన అనుచరుడు నారపోగు వెంకట్ మంగళవారం నిమ్స్ హాస్పటల్ లకు వెళ్లి పరామర్శించారు. పరామర్శలో భాగంగా తన వంతు సహాయంగా పదివేల రూపాయలను బాధ్యత కుటుంబానికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇశ్నేపల్లి రాజశేఖర్, పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ గుర్తింపు కార్డులు పంపిణీ

## -తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు



**వేంసూర్/మే6(జర్నలిస్ట్ వార్త):**తెలుగుదేశంపార్టీ బలోపేతనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను వేంసూరు గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు నూతన గ్రామ కమిటీలు మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు సత్తుపల్లి నియోజకవర్గం పర్యవేక్షకులు కేతినేని హరీష్ సూచనల మేరకు మండలంలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం అగ్రభాగాన నిలువగా నియోజకవర్గాల పరిధిలో సత్తుపల్లి నాలుగవ స్థానంలో నిలిచిందని తెలిపారు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటులో భాగంగా మండల కేంద్రమైన వేంసూర్ లో షేక్ బోలా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అదేవిధంగా మిగిలిన గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి తదుపరి మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుంది పేర్కొన్నారు పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి షేక్ బోలా కొప్పుల నాగేశ్వరరావు శేష మల్లయ్య ప్రభాకరరావు కుమారి సరోజిని సత్యవతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి ద్వితీయ వార్షికోత్సవం







**సత్తుపల్లి/మే6(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం లో మానవ హక్కుల పరిరక్షణ ప్రజా సమితి ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో నిర్వహించగా ముఖ్య అతిధులుగా పాల్గొన్న సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ .ఆత్మీయ అతిధులుగా హాజరై నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 జాతీయ విశిష్ట సేవా రత్న పురస్కారాలు, ఆషా స్వచ్ఛంద సంస్థ ద్వారా 25 సంవత్సరాలనుండి చేస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రజలు అందించిన ఆదరణ గురించి సమావేశం లో పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో టీ కిరణ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్,చిలుముల బాల్ రెడ్డి కలరత్న,నేరెళ్ల శ్రీనివాస్ రావు భారీ అసోసియేషన్ అధ్యక్షులు,శ్రీమతి పోలిశెట్టి హైమావతి, ప్రముఖ న్యాయవాది, ప్రముఖులు పాల్గొన్నారు.

# చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలని వినతి.

## -మత్స్యకారులతో డిఎఫ్ ఓ ను కలిసిన టిపిసిసి సభ్యుడు పెండెం రామానంద్



**నర్సంపేట/మే6(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచన మేరకు మత్స్యకారులతో డిఎఫ్ ఓ ను టిపిసిసి సభ్యుడు పెండెం రామానంద్ కలిసి చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలని మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి పి సి సి సభ్యులు పెండెం రామానంద్ మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా ఖానాపూర్ మండలానికి చెందిన పాకాల సరస్సులో 12 గ్రామాలకు సంబంధించిన దాదాపు 200 కుటుంబాలు తమ కులవృత్తిగా చేపలను పట్టుకొని జీవన ఉపాధి పొందుతున్నారని, గత 10రోజుల క్రితం పాకాల సరస్సులో చేపలను పడుతున్న మత్స్యకారుల వలలను స్థానిక .డి ఫ్ ఓ .వరంగల్ ఆదేశాల మేరకు వలలను ఫారెస్ట్ అధికారులు పట్టుకోవడం జరిగిందన్నారు. చేపలను పట్టే వలలను పట్టుకపోవడం వలన మత్స్యకారులు వారి ఉపాధిని కోల్పోవడం జరుగుతుందని విషయాన్ని. డి. ఫ్. ఓ. కి వివరించడం జరిగిందన్నారు, గతంలో మాదిరిగానే వారికి కేటాయించిన హద్దుల ప్రకారం వలలు వేసి చేపలు పట్టుకొని అవకాశాన్ని కల్పించాలని కోరడం జరిగిందని సానుకూలంగా స్పందించిన డి.ఫ్.ఓ. వరంగల్. మత్స్యకారులకు గతంలో మాదిరిగానే చేపలను పట్టుకొనే అవకాశాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్ శ్రీను, అల్లోరు, లక్ష్మీనారాయణ, రమేష్, రాజేందర్, వెంకన్న, రమేష్, రాజు, యాకన్న, రవి, మల్సుర్, శ్యాంరాజ్, శేఖర్, వెంకటేష్, జితేందర్, వెంకన్న, రాజయ్య, కార్తీక్, బిక్షపతి, సారంగం, సారంగం, కుమార్, తదితరులు పాల్గొన్నారు






# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా - కట్రియాల జడ్.పి.హెచ్.ఎస్ వేసవి శిక్షణ శిబిరం**
**- దమ్మన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన - ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పరిశీలన**
**- రామవరం గ్రామంలో మంచినీటి సరఫరా పరిశీలన - ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆకస్మిక సందర్శన**



**వరంగల్/మే 6(జర్నలిస్ట్ వార్త):**
భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి, దివిటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి, వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. భూ సంబంధిత సమస్యలు ఉన్నవారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఫార్మార్ రిజిస్ట్రర్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు విస్తీర్ణం హెచ్చుతగ్గులు వారసత్వ భూములు భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాల పరిశీలించినకలెక్టర్

వర్ధన్నపేట మండలం కట్రియాల జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పరిశీలించారు. పిల్లలు క్రీడలు, ఇతర సహ పాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని, తద్వారా వారి శారీరక, అభిజ్ఞ సామర్థ్యాలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల సజాత్మకతను పెంపొందించాలని అధికారులను సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్ర పరిశీలించిన కలెక్టర్

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, కొనుగోలు కేంద్రాల నిర్వహణ సిబ్బంది పనితీరు ధాన్యం నాణ్యత రైతుల అవసరాలు, డబ్బుల చెల్లింపు తదితర అంశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పరిశీలించారు. కేంద్రాల్లో ప్యాడి క్లీనర్లు, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీటి అందుబాటులో ఉండాలన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యదర్శికంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు.
సమస్యలు ఉన్నాయని ధాన్యం ఎగుమతి కొరకు ప్రస్తుతం ఉన్న ఒక లారీ ట్రిప్పు బదులు మరో లారీ ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అదనంగా లారీ ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ను చరవాణిలో కలెక్టర్ ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పరిశీలన

వర్ధన్నపేట మండలంలోని వర్ధన్నపేట, ఉప్పరపల్లి, రామవరం గ్రామాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా నిరుపేదలకు అందేలా జరగాలని అధికారులకు ఆదేశించారు.

## మంచినీటి సరఫరాలో కలెక్టర్ సంతృప్తి

రామవరం గ్రామంలో కలెక్టర్ నేరుగా గృహిణితో మంచినీటి సరఫరా సక్రమంగా అవుతుందాని అడుగగా, చివరి ఇంటి వరకు ప్రతిరోజు మంచినీరు అందుతుందని వారు తెలుపగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆకస్మిక సందర్శన



వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆకస్మికంగా సందర్శించారు. హాజరు రిజిస్టర్ పరిశీలించారు. గైర్హాజరైన వైద్యులపై తాకీదులు జారీ చేయాలని డి.సి.హెచ్.ఎస్ రామ్మూర్తి, సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహ స్వామి లను ఆదేశించారు. వైద్యులు సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.
వారి వెంట జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డబ్ల్యూఎస్ డిఈ శ్రీనివాస్, తహశీల్దార్ విజయసాగర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగుపై అవగాహన



పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా నెక్కొండ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి తరుణ్, రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో పరవతగిరి మండలం శ్రీనగర్ గ్రామం ప్రసాదేరెడ్డి తోటలో పామాయిల్ సాగుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిగ్నెట్ ఇరిగేషన్ ఇంజనీర్ ప్రమోద్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ రిషి, వినోద్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి తరుణ్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ తోటల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో వీటి విస్తీర్ణం పెంచడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. టన్నుకు రూ.21 వేల ధర పలుకుతుందన్నారు. పామాయిల్ సాగు యొక్క లాభాలు, యాజమాన్య పద్ధతులు మరియు వేసవిలో పామాయిల్‌కు అందించాల్సిన నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా, వేసవి సమీపిస్తున్నందున ఎండ వేడిమి/వేసవి గాడ్పులకు తట్టుకోవడానికి మొక్క ఎదుగుదలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, లేత మొక్కల (1-2 సంవత్సరాల వయస్సు కలిగిన) పాదు చుట్టూ ఆకు చివరి అంచుకు మూడు వరసలలో జనుము నాటాలని సూచించారు. తదుపరి తొలకరి జల్లులు వచ్చేంతవరకు జూన్ 20వ తేదీ వరకు జనుము ఎదుగుదలను కొనసాగించి ఆ తర్వాత జనుమును చిన్న చిన్న ముక్కలుగా చేసి పాదుల్లో మల్చింగ్ లాగా వేయండి. ఉదయం మరియు సాయంత్రం వేళల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించడం, అలాగే ఎరువుల యాజమాన్యం (ఫెర్టిగేషన్) గురించి కూడా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం రైతులకు పామాయిల్ సాగుపై సరైన అవగాహన కల్పించి, అధిక దిగుబడి సాధించడానికి తోడ్పడుతుందని అధికారులు తెలిపారు.

# భూ భారతి చట్టం ఆధారంగా భూ సమస్యల పరిష్కారం

**- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య**





**హనుమకొండ/మే 6(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూ భారతి చట్టం ఆధారంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా నడికుడ మండలం సర్వాపూర్, ముస్త్యాలపల్లి గ్రామాలలో భూ భారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు అధికారులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుకు జిల్లాలో నడికూడ మండలాన్ని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. రెవెన్యూ సదస్సులో రైతులు అందించే విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. స్వాతంత్ర్య భారతదేశంలో 1954లో కాస్ర పహాణి ద్వారా భూ రికార్డులకు సంబంధించి బేస్ డాక్యుమెంట్ ఉండేదన్నారు. 2020 లో ధరణి చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. గతంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేదిగా కొత్తగా తీసుకువచ్చిన ధరణి చట్టం ఉండాలి కానీ దాని ద్వారా భూ సమస్యలు ఇంకా ఎక్కువ అయ్యాయని అన్నారు. ధరణి చట్టం గ్రామాలలో భూ సమస్యలు కుటుంబాల మధ్య విభేదాలకు కారణమైందన్నారు. గతంలో భూ రికార్డులలో పట్టాదారులు ఉన్నప్పటికీ ఖాస్తు కాలమ్ లో అనుభవదారు కాలమ్ ఉండేదన్నారు. ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత అనుభవదారు కాలమ్ ను తీసేసారని అన్నారు. అనుభవదారు కాలమ్ తీసివేయడం పెద్ద తప్పిదమన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రావడానికి రైతులు ప్రధాన భూమిక పోషించారని అన్నారు. పైలెట్ గా ఎంపికైన నడికూడ మండలంలో రైతులు సూచించిన సమస్యలను క్రోడీకరించి ఈ నెల చివరినాటికి ఈ గ్రామాలకు సంబంధించి భూ సమస్యలను తహసిల్దార్ ఆర్డీవోలు తగిన పరిష్కారానికి చర్యలు చేపడతారని అన్నారు. సర్వేయర్లు లేకపోవడంతో అనేక చోట్ల సర్వే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దీనిలో భాగంగానే ప్రత్యేకంగా సర్వేయర్లను నియమిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం కావాలన్నారు. 1954 లో వచ్చిన కాస్రా పహాని బేస్ గా ఉందో అదేవిధంగా భూభారతి చట్టం భూ సమస్యల నమస్కారానికి బేస్ గా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పెట్టుకున్న రైతులకు వారి చుట్టుపక్కల ఉన్నవారికి నోటీసులు అందించి క్షేత్రస్థాయిలో విచారించి, నెలాఖరు వరకు పరిష్కారమవుతాయన్నారు. పైలెట్ మండలంలో ఉన్న నడికూడ మండలంలో 90 శాతం వరకు భూ సమస్యలు నెలాఖరు వరకు పరిష్కారమవుతాయన్నారు. మిగిలిన 10 శాతం సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సమస్యలు ఉన్న రైతులు అర్జీలను అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, హనుమకొండ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్, నడికూడ తహసిల్దార్ నాగరాజు, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.




# గాలివానకు లేచిపోయిన రైతు వేదికపై కప్పు

**పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని చౌటపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వేసిన గాలివానకు రైతు వేదిక పైకప్పు రేకులతో సహా కూలిపోయింది. గత ప్రభుత్వంలో హడావిడిగా రైతు వేదికను నిర్మించడంతో నాణ్యత లేక గాలివానకు పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కూలీలతో వెళ్తున్న టాటా ఏసి వాహనం బోల్తా



**రాయపర్తి/మే6(జర్నలిస్ట్ వార్త):**వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బంధనపల్లి గ్రామంలో స్లాబ్ పోసే కూలీలతో వెళ్తున్న టాటా ఏసీ వాహనం మంగళవారం అదుపుతప్పి బోల్తా పడింది.ప్రమాద సమయంలో వాహనం లో 12మంది కూలీలు ఉండగా,ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.గాయ పడిన వారిని స్థానికులు 108 వాహనంలో వర్ధన్నపేట ఆసుపత్రికి తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బీజేపీ మండల అధ్యక్షుడు గా బిక్షపతి



**పర్వతగిరి/మే6(జర్నలిస్ట్ వార్త):**పర్వతగిరి మండల బిజెపి అధ్యక్షునిగా మండలంలోని దౌలత్ నగర్ గ్రామానికి చెందిన చీమల బిక్షపతి యాదవ్ మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

## కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు

# పటిష్ట ఏర్పాట్లు చేయండి

-లక్షలాదిగా వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలి.

-రవాణా, పారిశుద్ధ్యం, భద్రతా, వైద్యం, ప్రచార చర్యలు పక్కాగా ఉండాలి.

-గతంలో సమ్మక్క - సారక్క ఇతర దైవ కార్యాల అనుభవాలతో ఏర్పాట్లు చేయాలి.

-చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు రావొద్దు.

-పెండింగ్ ఇంజినీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

-అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు ఆదేశం.

-సమీక్షా సమావేశంలో పాల్గొన్న సీఎస్, డీజీపీ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే.



**భూపాలపల్లి/మే6(జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే అంతర్వాహిని సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమలు, చేనేత శాఖ శాఖల మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలపై డా బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ పుష్కరాల కు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశి (మిథునరాశి)లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలిపారు. ఈ పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రారంభించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతం గా చేపట్టినట్లు మంత్రులు తెలిపారు. చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయని... అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం మాదిరి ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించుటకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చలువ పందిళ్లు, టెంట్‌లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కాళేశ్వరంకు సంబంధించిన వివరాలన్నీ వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియ జేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను విస్తృతంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు ఆదాయం చేకూరిందని, మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ వివరించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. 'ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.

### పీఠాధిపతులో పవిత్ర పుష్కర స్నానం

సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామిలు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్ అండ్ బీ ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, పంచాయతి రాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్. కుమార్, సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## రాయల వెంకటశేషగిరిరావు కు ఘన నివాళి



**తల్లాడ/మే6(జర్నలిస్ట్ వార్త):** రాయల వెంకటశేషగిరిరావు కు ప్రముఖులు మంగళవారం ఘన నివాళి లు అర్పించారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావుకు ఖమ్మం జిల్లా డైనమిక్ లీడర్ మృతి చెంది ఈనాటికీ ఏడాది అవటంతో అలాంటి మహోన్నతమైన వ్యక్తి ముక్కుసూటి మనిషి, మకుటం లేని మహారాజు, నేటితరంలో కానీ ఆనాటి తరంలో కానీ ఇంకేన్నటికీ లేనటువంటి నాయకుడు మన మాజీ డిసిఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావుకి ఈరోజుకి మృతి చెంది ఏడాది కాబోతోంది కాబట్టి అలాంటి వ్యక్తికి ఘన నివాళి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మండల నాయకులు దిరిశాల దాసు రావు నివాళులుఅర్పించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## యతాలకుంట అడవి ప్రాంతంలో అడవి దున్నలు ఢీకొని ఆటో పల్టి



**సత్తుపల్లి/మే6(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మండలం కిస్టారం అన్నపురెడ్డి పల్లి రోడ్డు మార్గం లో యథాలకుంట అటవీ ప్రాంతంలో మంగళవారం అడవి దున్నలు రోడ్డు దాటుతూ రోడ్డు పై వస్తున్న ఆటో నీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరకీ గాయాలు అయ్యాయి. చుంచుపల్లి మండలం పెనగడప కు చెందిన 5 గురు కూలీలు సత్తుపల్లి లో పని నిమిత్తం ఆటో లో వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదం లో ఆటో డ్రైవర్ శివ, కూలి ఓదెలు కు గాయాలు అయ్యాయి. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## ఏపీలో అద్భుతం

## మిట్ట మధ్యాహ్నం నీడ మాయం



**సత్తుపల్లి/మే6(జర్నలిస్ట్ వార్త):** మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఖగోళ అద్భుతం వల్ల ఈ నెల 14వ తేదీ వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు మాయమవుతుందని ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్స్ సర్చ్ క్యాంపెయిన్ (ఐఏఎస్‌సీ) జాతీయ కన్వీనర్ మేకా సుసత్యరేఖ తెలిపారు. ఈ పరిణామాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒకపక్క కనిపిస్తుందని కాని ఇవాళ్టి నుంచి 14వ తేదీ వరకు మాత్రం ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ మాయమవుతుందని సుసత్యరేఖ వివరించారు.

**సూర్యుని స్థానం మారుతూ :** భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుని స్థానం ఉత్తర - దక్షిణ దిశల్లో మారుతూ ఉంటుందని సుసత్యరేఖ వెల్లడించారు. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకరరేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయాల్లో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయని చెప్పారు. దీనివల్ల నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుందని వివరించారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుని కదలిక, స్థానాన్ని అధ్యయనం చేసేందుకు జీరోషాడో ఎంతగానో ఉపకరిస్తుందని సుసత్యరేఖ తెలిపారు.

## నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**హనుమకొండ/మే 6(జర్నలిస్ట్ వార్త):** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో వివిధ వసతుల కల్పనకు చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిని గురించి జిల్లా కలెక్టర్ కు అధికారులు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన విద్యుత్తు, తాగునీరు, టాయిలెట్స్ పనులను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఈజీఎస్ ద్వారా చేపట్టిన కిచెన్ షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, ఇతర అధికారులు, సీడిపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీట్స్, కారా మిక్చర్ తయారీ కేంద్రంపై

### తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ, టాస్కోఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు





**వరంగల్/మే 6(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి, స్వాతి, శ్రీశికలతో కూడిన బృందం వరంగల్ జిల్లా గొర్రెకుంటలోని భవాని స్వీట్స్, కారా తయారీ కేంద్రం (బెల్ బ్రాండ్) లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తయారీ కేంద్రం వద్ద కారా స్వీట్స్ తయారు చేసే పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం, ఫుడ్ హ్యాండ్లర్స్ సరైన పరిశుభ్రతను పాటించకపోవడం, హెయిర్ క్యాప్స్, హ్యాండ్ గ్లౌజ్ ఉపయోగించకపోవడం, తుప్పు పట్టిన యంత్రాలను ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించడం, గోడలు, పైకప్పులో బూజు పట్టి ఉండడం, కాలం చెల్లిన బిస్కెట్స్, ఇతర కన్ఫెక్షనరీ పదార్థాలు, శనగపప్పు లాంటివి గుర్తించడంపై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడే సుమారు 2 లక్షలు 40 వేల రూపాయల విలువగల1800 కిలోల కాలం చెల్లిన శనగపప్పు, సుమారు లక్షల 50 వేల రూపాయల విలువ గల లేబుల్ డిఫెక్ట్స్ కలిగినటువంటి ఇతర కన్ఫెక్షనరీ ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకూడదని వాటిని ఎఫ్ ఎస్ ఎస్ 2006,చట్టం ప్రకారం సీజ్ చేసి నోటీసులు జారీ చేయడం జరిగింది మరియు అనుమానిత శాంపిలను సేకరించి హైదరాబాద్లో గల ల్యాబ్ కి పంపడం నివేదిక ఆధారంగా కల్తీ అనే నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్య చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు మరియు ఆహారం అమ్మేవారు ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించి, ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఆహారాన్ని ప్రజలకు విక్రయించాలని హెచ్చరిస్తూ లేనియెడల చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ కూడా చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఆహారాన్ని తయారుచేసి, నిలువ చేసి,రవాణా చేసి ప్రజలకు అమ్మే వ్యాపారస్తులు కల్తీల పట్ల అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన శుచి, శుభ్రత గల ఆహార పదార్థాలను మరియు ఆహార వ్యాపారులు సరైన బాధ్యతతో వ్యవహరించాలని, సురక్షితమైన కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించవలసిందిగా వ్యాపారస్తులను టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి సూచించారు. ఈ నిబంధనలు పాటించని యెడల చట్ట ప్రకారం శిక్షకు గురి కాబడతారని హెచ్చరించడం జరిగింది. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి జంక్షన్ పనులను పరిశీలించిన వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





**వరంగల్/మే 6(జర్నలిస్ట్ వార్త):** వరంగల్, కరీంనగర్, సిద్ధిపేట జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులను మంగళవారం వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటు, శిల్పాలు, విద్యుత్ లైట్లు, సైన్ బోర్డులు, సెంట్రల్ లైటింగ్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. వారితో పాటు కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు కలిసి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చేస్తున్న పనులపై అధనంగా సూచనలు చేశారు.

# సన్ రైజర్స్ కథ కంచికి..

## టైటిల్ గెలవాలనే కలపై వరుణుడు నీళ్లు



సన్‌రైజర్స్ హైదరాబాద్ పాలిట వర్షం విలన్‌గా మారిందిబీ టైటిల్ గెలవాలనే కలపై వరుణుడు నీళ్లు చల్లేశాడు. సోమవారం వర్షం కారణంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు అయింది. ఈ మ్యాచ్‌లో, హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. బ్యాటింగుకు దిగిన ఢిల్లీ జట్టు కేవలం 133 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఢిల్లీ ఇన్నింగ్స్ పూర్తయిన వెంటనే మ్యాచ్ సమయంలో వర్షం పడటంతో హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ కు దిగలేకపోయింది. దీని తరువాత, మైదానం చాలా చిత్తడిగా ఉండటంతో, అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేయాలని నిర్ణయించుకున్నారు, ఇరు జట్లకు చెరొక పాయింట్ ఇచ్చారు.సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటివరకు ఐపీఎల్‌లో మొత్తం 11 మ్యాచ్‌లు ఆడింది, వాటిలో ఆ జట్టు కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయ్యింది. ప్రస్తుతం, 7 పాయింట్లతో నిలిచింది. అయితే ప్రస్తుత సీజన్‌లో సన్ రైజర్స్ ఆడాల్సిన మ్యాచులు కేవలం మూడు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచ్‌లు అన్నింటిలో గెలిచినా, సన్ రైజర్స్ కేవలం 13 పాయింట్లకు మాత్రమే చేరుకుంటుంది. అదే సమయంలో, ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో 14 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లను కలిగి ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో, సన్ రైజర్స్పాయింట్ల పట్టికలో టాప్-4కి చేరుకోలేదు. దీని కారణంగా, సన్ రైజర్స్ ప్లేఆఫ్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించినట్లే. అలాగే టైటిల్ గెలవాలనే వారి కల చెదిరిపోయింది. వర్షం పడకపోతే, సన్ రైజర్స్ మ్యాచ్ గెలిచి ఉంటే, ప్లేఆఫ్‌లపై వారి ఆశలు చెక్కుచెదరకుండా ఉండేవి, కానీ అది జరగలేదు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రారంభంలోనే వికెట్లు పడ్డాయి. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు చాలా తక్కువ స్కోరుకే ఆలౌట్ అవుతుందని అందరూ భావించారు. ఆ తర్వాత అశుతోష్ శర్మ, ట్రిస్టన్ స్టబ్స్ 82 పరుగుల ఇన్నింగ్స్ ఆడి జట్టు స్కోరును 100 పరుగుల మార్కును దాటించారు. నిర్ణీత 20 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 133 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో పాట్ కమ్మిన్స్ నాలుగు ఓవర్లలో 19 పరుగులిచ్చి మూడు ముఖ్యమైన వికెట్లు పడగొట్టాడు. జయదేవ్ ఉనద్కత్, ఇషాన్ మలింగ, హర్షల్ పటేల్ చెరో వికెట్ తీశారు. సన్ రైజర్స్ బౌలర్ల విజృంభణ కారణంగా ఢిల్లీ జట్టు పెద్దగా స్కోరు చేయలేకపోయింది.

# ఆఖరి బంతికి

## ముంబైపై గుజరాత్ టైటాన్స్ విజయం

ముంబై:
తాజా సీజన్‌లో హైలైట్ అనదగ్గ మ్యాచ్ అంటే ఇదేనేమో. గుజరాత్ టైటాన్స్ ముందు కేవలం 156 పరుగుల ఛేదనే అయినా ఎన్ని మలుపులో.. ముంబై ఇండియన్స్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. దీనికితోడు రెండుసార్లు వరుణుడితో ఇబ్బంది. సవరించిన ఛేదన ప్రకారం ఆఖరి ఓవర్‌లో 15 పరుగులు కావాల్సిన వేళ మరింత హైడ్రామా నెలకొంది. అయినా ఎలాగోలా ఆఖరి బంతికి సింగిల్‌తో టైటాన్స్ ఊపిరిపీల్చుకుంది. దీంతో మంగళవారం జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన గుజరాత్ నెగ్గింది. అలాగే 16 పాయింట్లతో టాప్‌లోకి చేరింది. అటు ముంబై వరుస ఆరు విజయాలకు బ్రేక్ పడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53), సూర్యకుమార్ (24 బంతుల్లో 5 ఫోర్లతో 35), బాష్ (27) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సాయికిశోర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనను వర్షం కారణంగా గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147 పరుగులకు కుదించారు. అయితే, గుజరాత్ సరిగ్గా అన్నే ఓవర్లలో 147 రన్స్ చేసి గెలిచింది. గిల్ (43), బట్లర్ (30), రూథర్‌ఫోర్డ్ (28) పోరాడారు. బుమ్రా, బౌల్ట్, అశ్వనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.
%వణికించిన బౌలర్లు: స్వల్ప ఛేదనలో గుజరాత్ ఇన్నింగ్స్ సజావుగా ఏమీ సాగలేదు. పేసర్లు దీపక్, బౌల్ట్, బుమ్రా కట్టుదిట్టమైన బంతులకు పరుగులు రావడమే కష్టమైంది. గిల్, బట్లర్, రూథర్‌ఫోర్డ్ మినహా మరెవరూ దీటుగా నిలబడలేదు. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయి సుదర్శన్ (5)ను రెండో ఓవర్‌లోనే బౌల్ట్ అవుట్ చేశాడు. బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో ఆ తర్వాత గిల్, బట్లర్ నిదానం కనబర్చారు. దీంతో పవర్‌ప్లేలో 29/1 స్కోరు మాత్రమే సాధించింది. అయితే హార్దిక్ తన ఓవర్‌లో మూడు వైడ్లు, రెండు నోబ్స్, 4,6తో 18 పరుగులు సమర్పించుకున్నాడు. 12వ ఓవర్‌లో గిల్ సులువైన క్యాచ్‌ను తిలక్ వదిలేయగా.. తర్వాతి బంతికే బట్లర్‌ను అశ్వని అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆచితూచి సాగుతున్న ఇన్నింగ్స్‌కు రూథర్‌ఫోర్డ్ కదలిక తెచ్చాడు. 13వ ఓవర్‌లో అతడి 4,4,6తో 15 రన్స్ వచ్చాయి. 14వ ఓవర్ ముగిశాక వర్షం కారణంగా అర్ధగంట పాటు మ్యాచ్ ఆగింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ ఒక్కసారిగా తడబడింది. వరుసగా నాలుగు ఓవర్లలో గిల్, రూథర్‌ఫోర్డ్, షారుక్ (6), రషీద్ (2)ల వికెట్లను కోల్పోయింది. ఇక 12 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ మరోసారి వర్షంతో బ్రేక్ ఏర్పడింది. అర్ధరాత్రి 12.30కి మ్యాచ్ ఆరంభం కావడంతో లక్ష్యం 19 ఓవర్లలో 147కు మార్చారు. దీంతో గుజరాత్ ఆరు బంతుల్లో 15 పరుగులు చేయాల్సి ఉండగా..తెవాటియా ఫోర్, కొట్జీ సిక్సర్ బాదాడు. అయితే, ఐదో బంతికి కొట్జీని చాహర్ అవుట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. కాగా, ఆఖరి బంతికి కావాల్సిన సింగిల్‌ను అర్షద్ పూర్తిచేయడంతో గుజరాత్ గట్టెక్కింది.



# కెప్టెన్సీ బాధ్యతతో బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుంది

## అందువల్లే కెప్టెన్సీ వదులుకున్నా: విరాట్ కోహ్లి

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రికెట్‌లో అనేక రికార్డులు సృష్టించాడు. ఇతర ప్లేయర్లు అసాధ్యం అనుకున్న ఎన్నో ఘనతలు కోహ్లీ సాధించాడు. అయితే బ్యాటర్‌గా సూపర్ సక్సెస్ అయిన, విరాట్ కెప్టెన్‌గానూ రాణించాడు. గతంలో అటు టీమ్‌ఇండియాతోపాటు, ఇటు డొమెస్టిక్‌లో ఆర్సీబీ జట్టును నడిపించాడు. కానీ, కొంతకాలానికే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. అయితే అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో విరాట్ తాజాగా వివరించాడు.తొలుత 2021 వరల్డ్‌కప్ తర్వాత టీ20ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. ఓ సంవత్సరం అనంతరం సౌతాఫ్రికాతో ఓటమి తర్వాత టెస్టు కెప్టెన్సీని బాధ్యతల వదులుకున్నాడు. 2021 ఐపీఎల్ టోర్నీ తర్వాత బెంగళూరు జట్టు పగ్గాలు కూడా వదిలేశాడు. విరాట్ ఇలా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడం అప్పట్లో సంచలనంగా మారింది. అప్పుడు తాను కెప్టెన్సీ ఎందుకు వదులుకున్నాడో తాజాగా విరాట్ క్లారిటీ ఇచ్చాడు.'ఆర్సీబీ బోల్డ్ డైరీస్' పాడ్‌కాస్ట్‌లో తాజాగా మాట్లాడిన విరాట్ దీనిపై క్లారిటీ ఇచ్చాడు. కెప్టెన్సీ బాధ్యత ఒత్తిడి వల్ల తన బ్యాటింగ్‌పై ప్రభావం పడడం వల్లే కెప్టెన్సీ వదులుకున్నట్లు విరాట్ తెలిపాడు. బ్యాటింగ్‌లో రాణించడం కోసమే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నట్లు చెప్పాడు.'2016- 2019 మధ్యలో నేను తీవ్ర ఒత్తిడికి గురయ్యా. టీమ్‌ఇండియాకు 7- 8ఏళ్లు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తొమ్మిది సంవత్సరాలు కెప్టెన్‌గా వ్యవహరించాను. నేను ఆడిన ప్రతీ మ్యాచ్‌లో నాపై భారీ అంచనాలు ఉండేవి. ఇది నాలో ఒత్తిడికి తీసుకొచ్చింది. ఈ బాధ్యతలు పక్కన పెట్టేసి, హ్యాపీగా క్రికెట్ ఆడాలనుకున్నా. అందుకే నేను కెప్టెన్సీ బాధ్యతలు వదులుకున్నా. ఇప్పుడు నిజంగా స్వేచ్ఛగా ఆడుతున్నా. ఈ సీజన్‌లోనూ నిలకడగా పరుగులు సాధిస్తున్నా' అని విరాట్ పేర్కొన్నాడు.కాగా, ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో విరాట్ అదరగొడుతున్నాడు. ఇప్పటివరకు 11 మ్యాచ్‌ల్లో 63.13 యావరేజ్‌తో 505 పరుగులు చేసి టాప్‌లో కొనసాగుతున్నాడు. ఇందులో 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ సైతం విరాట్ దగ్గరే ఉంది.



# ఆర్‌సీబీ అభిమానులకు బ్యాడ్ న్యూస్

## ప్లే ఆఫ్స్‌కు రొమారియో షెపర్డ్ దూరం!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఆ జట్టు విధ్వంసకర బ్యాటర్, వెస్టిండీస్ క్రికెటర్ రొమారియో షెపర్డ్ జట్టుకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలకమైన ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు ముందే రొమారియో షెపర్డ్ జట్టును వీడుతాడని వార్తలు వస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో షెపర్డ్ విధ్వంసం సృష్టించాడు. 16 నిమిషాలే క్రీజులో ఉన్న ఈ విండీస్ ఆటగాడు 14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 53 పరుగులతో భీభత్సం సృష్టించాడు.అతని ధాటికి ఆర్‌సీబీ చివరి 2 ఓవర్లలో 54 పరుగులు చేసింది. రొమారియో షెపర్డ్ విధ్వంసకర బ్యాటింగ్, యశ్ దయాల్ సంచలన బౌలింగ్‌తో ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 పరుగుల తేడాతో గెలిచి ప్లే ఆఫ్స్ బెర్త్‌కు చేరువైంది. మరో విజయం సాధిస్తే ఆ జట్టు టాప్-2 ప్లేస్ కూడా ఖరారు అవుతోంది. ఈ మ్యాచ్‌తో రొమారియో షెపర్డ్ ఎంత కీలకమైన ఆటగాడో అందరికి తెలిసొచ్చింది.ఆరంభంలో బెంచ్‌కే పరిమితమైన షెపర్డ్.. లియామ్ లివింగ్ స్టోన్ వైఫల్యంతో తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టుకు కీలక ఆటగాడిగా మారాడు. అయితే ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌ల కోసం వెస్టిండీస్ జట్టు ఆ దేశాల్లో పర్యటించనుంది. ఈ రెండు సిరీస్‌లకు రొమారియో షెపర్డ్ ఎంపికయ్యాడు. అతనితో పాటు గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్ కూడా ఎంపికయ్యాడు. మే 21-25 మధ్య ఐర్లాండ్‌తో వెస్టిండీస్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత మే 29 నుంచి జూన్ 3 మధ్య ఇంగ్లండ్‌తో మూడు వన్డే సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌ల కోసం రొమారియో ఆర్‌సీబీ వీడాల్సి ఉంది. రొమారియో షెపెర్డ్ జట్టు వీడటంపై ఆర్‌సీబీ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఒకవేళ అతను దూరమైతే మాత్రం టీమ్ కాంబినేషన్ దెబ్బతిననుంది. మే20, మే 21, మే 23 తేదీల్లో ప్లే ఆఫ్స్ జరగనుండగా.. మే 25న ఫైనల్ జరగనుంది. ఒకవేళ రొమారియో షెపర్డ్ దూరమైతే.. ఆర్‌సీబీ నష్టం జరగనుంది. ఈ సీజన్‌లో ఆర్‌సీబీ దుమ్మురేపుతోంది. ఎన్నడూ లేని విధంగా సమష్టి ప్రదర్శనతో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు ఆడిన ఆర్‌సీబీ 8 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆర్‌సీబీలోని ఆటగాళ్లంతా సూపర్ ఫామ్‌లో ఉన్నారు.



# భారత క్రికెట్ ఎవరి సొత్తూ కాదు

## విమర్శకులకు గంభీర్ ఘాటు కౌంటర్

న్యూఢిల్లీ: 'భారత క్రికెట్ ఎవడబ్బ సొత్తూ కాద'ని టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. తన కోచింగ్‌పై విమర్శలు చేస్తున్న మాజీ ఆటగాళ్లకు ఘాటుగా బదులిచ్చాడు. 'కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడే.. ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుసు. దేశం గర్వపడేలా చేయడమే నా పని. అంతేకానీ ఏసీ గదుల్లో కూర్చొని కామెంట్రీ పేరుతో ఏదో మాట్లాడే వారిని ప్రసన్నం చేసుకోవడం కాదు' అని కౌంటర్ ఇచ్చాడు. కొందరు మాజీలు భారత క్రికెట్‌ను సొంత ఆస్తిలా భావిస్తున్నారన్నాడు. 'కొందరు 25 ఏళ్లుగా కామెంట్రీ బాక్స్‌లో తిష్టవేసుకొని కూర్చొన్నారు. భారత క్రికెట్ ఏదో వారి కుటుంబ ఆస్తి అని అనుకొంటున్నారు. కానీ, ఇదంతా భారత ప్రజలది అనే వాస్తవాన్ని గుర్తించాలి' అని గౌతీ అన్నాడు. ఇక, ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ఎంపికలో తన జోక్యం ఏమీలేదన్నాడు. రోహిత్, కోహ్లీ మెరుగైన ప్రదర్శన చేస్తున్నంత కాలం జట్టులో కొనసాగే అర్హత ఉంటుందని చెప్పాడు. జట్టు ఎంపికలో తన పాత్ర లేదని.. అంతా సెలెక్టర్లదేనని గంభీర్ తెలిపాడు.

పహల్గాం దాడి నేపథ్యంలో.. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలకనంత వరకు పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలని గంభీర్ డిమాండ్ చేశాడు. ఆసియాకప్, ఐసీసీ ఈవెంట్లలో కూడా పాక్‌తో ఆడకూడదనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నాడు.

# ఫేవరెట్ గుకేష్

## నేటి నుంచి సూపర్‌బెట్ క్లాసిక్



బుకారెస్ట్ (రుమేనియా): సూపర్‌బెట్ క్లాసిక్ చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా బుధవారం నుంచి జరగనున్న ఈ ఈవెంట్‌లో మొత్తం 10 మంది గ్రాండ్ మాస్టర్లు తలపడనున్నారు. కాగా, తొలి రౌండ్‌లో సహచర జీఎం ప్రజ్ఞానందతో గుకేష్ ఆడనున్నాడు. గత జనవరిలో టాటా స్టీల్ చెస్‌లో రెండో స్థానంలో నిలిచిన గుకేష్.. 3 నెలల విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు.

# తెలుగు స్విమ్మర్ల పతకాల పంట



పట్నా/న్యూఢిల్లీ: ఖేలో ఇండియా యువజన క్రీడల్లో మంగళవారం తెలుగు స్విమ్మర్లు పతకాల పంట పండించారు. తెలంగాణకు చెందిన వర్షిత్ (బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే), సుహాస్ ప్రీతమ్ (బాలుర 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్), శ్రీనిత్య సాగి (బాలికల 100 మీ. బ్యాక్‌స్ట్రోక్) తమ విభాగాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి మూడు స్వర్ణాలు అందించారు. ఇక, ఒక కిలోమీటర్ సైక్లింగ్ ట్రాక్ ఈవెంట్‌లో సాయిచరణ్ యాదవ్ కాంస్యం నెగ్గి తెలంగాణ ఖాతాలో నాలుగో పతకాన్ని చేర్చాడు. స్విమ్మింగ్ 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్‌కుమార్ యాదవ్, తీర్థు సామదేవ్ వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు. ఇక, 400 మీ. వ్యక్తిగత మెడ్లేలోనూ సత్తా చాటుతూ తీర్థు సామదేవ్ రజతం గెలిచాడు.

# అందానికి అదృష్టం తోడైతేనే !



వెండితెరపై హీరో ఎన్ని సాహసాలు .. పోరాటాలు చేసినా, ఆయన హీరోయిన్ తో కలిసి పాడుకునే సమయం కోసమే ఆడియన్స్ వెయిట్ చేస్తూ ఉంటారు. అలాగే హీరో సామాజిక సేవలో ఎంతగా తరిస్తూ ఉంటాడనే దానికంటే, ఆయన హీరోయిన్ తో కలిసి చేసే రొమాన్స్ కోసం ఆడియన్స్ ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటారు. హీరో కోసం థియేటర్ కి వచ్చినా, హీరోయిన్ ఎప్పుడు తెరపైకి వస్తుందా అని ఎదురుచూడని మాస్ ఆడియన్స్ దాదాపుగా ఉండరు. అందుకనే హీరోయిన్స్ అందంగా ఉండేలా మేకర్స్ శ్రద్ధ తీసుకుంటూ ఉంటారు. అలాంటి అందాల హీరోయిన్స్ జాబితాలో ఈ మధ్య 'ఇవాన' కనిపిస్తోంది. తమిళంలో నెక్స్ట్ లెవెల్ హీరోయిన్స్ బౌండరీలోకి అడుగుపెట్టడానికి ట్రై చేస్తున్న ఈ బ్యూటీ, ఒక హిట్ తో తెలుగు ఆడియన్స్ ముందుకు రావడానికి ఆరాటపడుతోంది. అలా ఆమె చేసిన సినిమానే 'సింగిల్'. శ్రీవిష్ణు జోడీగా ఆమె నటించిన ఈ సినిమా, ఈ నెల 9వ తేదీన థియేటర్లకు వస్తోంది. కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తాను 'హరిణి' అనే పాత్రలో కనిపిస్తాననీ, ఈ పాత్ర తనకి మంచి గుర్తింపు తెచ్చిపెడుతుందనే నమ్మకంతో ఇవాన ఉంది. విశాలమైన కళ్లతో .. నవరసాలను నాజూకుగా పలికించే ఈ సుందరికి, ఇక్కడ కూడా అభిమానుల సంఖ్య ఎక్కువే. అందం విషయంలో అమ్మడికి ఢోకా లేదు. కాకపోతే అదృష్టం కూడా తోడుకావాలంతే అంటున్నారు ఫ్యాన్స్. ఈ సినిమాతో తెలుగులోనూ ఈ బ్యూటీ బిజీ అవుతుందేమో చూడాలి మరి.

# క్యాథరిన్ థెస్రాకు బంపర్ ఆఫర్



టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ- ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది..మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు-గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఓకే అయ్యిందట. సెకండ్ హీరోయిన్ అయినప్పటికి చిరుతో ఒకటి రెండు పాటలు ఉండడోతున్నయట. అయితే ఇక్కడ క్యాథరిన్ చిరుకి సంబందించి ఓ వార్త వైరల్ అవుతుంది..

ఏంటీ- అంటే.. చిరంజీతో నటించే అవకాశం క్యాథరిన్ కు 2017లోనే వచ్చిందట. 'ఖైదీ నెంబర్ 150' కోసం వివి వినాయక్ తొలుత ఆమెనే అనుకున్నారట. కానీ సుష్మితతో వచ్చిన విబేధాల కారణంగా క్యాథరిన్‌ని తప్పించి కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారట. ఇక కట్ చేస్తే తొమ్మిది సంవత్సరాల తర్వాత క్యాథరిన్ తిరిగి ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం.

## ఇట్స్ కన్ఫామ్... తల్లిదండ్రులు కాబోతున్న

# లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్



టాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ తేజ్, నటి లావణ్య త్రిపాఠి దంపతులు తమ అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. తాము త్వరలో తల్లిదండ్రులం కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. గత కొంతకాలంగా లావణ్య గర్భవతి అంటూ వస్తున్న వార్తలకు ఈ ప్రకటనతో తెరపడింది. ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలలో ఓ ప్రత్యేకమైన ఫొటోను పంచుకున్నారు. ఆ ఫొటోలో చిన్నారి షూస్‌తో పాటు వరుణ్, లావణ్య ఒకరి చేతిని ఒకరు పట్టుకుని కనిపించారు. ఈ ఫొటోకు "జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించబోతున్నాం. త్వరలో రాబోతుంది" అనే అర్థవంతమైన వ్యాఖ్యను జోడించి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. గతేడాది (2023) ఇటలీలో వైభవంగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ ప్రేమ బంధాన్ని తర్వాతి దశకు తీసుకువెళ్తున్నట్లు ఈ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వార్త తెలియగానే మెగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా వరుణ్, లావణ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నెటిజన్లు కూడా వారికి అభినందనలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు. మెగా ఫ్యామిలీలో సంతోషకరమైన వాతావరణం నెలకొంది. సినిమాల విషయానికొస్తే, వరుణ్ తేజ్ వివాహం తర్వాత కూడా వరుసగా చిత్రాల్లో నటిస్తూ కెరీర్‌పై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆయన పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# 'హరిహర వీరమల్లు' షూటింగ్ ముగించుకున్న పవన్ కల్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రీకరణ ఎట్టకేలకు పూర్తయింది. పలుమార్లు వాయిదాల అనంతరం, ఈ సినిమా షూటింగ్ ఈ వారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో ముగిసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ వార్త పవన్ కళ్యాణ్ అభిమానుల్లో, తెలుగు సినీ పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీవారణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, తన రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ సినిమా చివరి షెడ్యూల్ కోసం రెండు రోజులు కేటాయించారు. ఈ రెండు రోజుల్లో ఆయనకు సంబంధించిన మిగిలిన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేశారు. షూటింగ్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా, సాంప్రదాయబద్ధంగా గుమ్మడికాయ కొట్టే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు సమాచారం. చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో, నిర్మాతలు త్వరలోనే సినిమా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తారని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో పలు వాయిదాల కారణంగా నిరాశ చెందిన అభిమానులకు ఇది ఊరటనిచ్చే అంశం.

క్రిష్ జాగర్లమూడి, ఏఎం జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్య కాలం నాటి కథతో తెరకెక్కుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన చారిత్రక కథనంతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. వాస్తవానికి మే 9న విడుదల కావాల్సి ఉండగా, పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యకలాపాలు, సినిమా షూటింగ్ షెడ్యూళ్ల మధ్య సమన్వయం కారణంగా పలుమార్లు వాయిదా పడింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. త్వరలోనే ట్రైలర్, కొత్త పాటలు విడుదల చేసి సినిమాపై అంచనాలను మరింత పెంచేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఒక ప్రకటన విడుదల చేసింది. "పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ గారు 'హరిహర వీరమల్లు' చివరి రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఈ భారీ సినిమా షూటింగ్ ప్రయాణం దిగ్విజయంగా ముగిసింది. మీరు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ట్రైలర్, అద్భుతమైన పాటలు త్వరలోనే మీ ముందుకు రానున్నాయి. తుపానుకు కౌంట్‌డౌన్ ఇప్పుడు మొదలైంది" అని మేకర్స్ తెలిపారు.

ప్రస్తుతం 'హరి హర వీరమల్లు' పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లోకి ప్రవేశించనుంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కావడంతో, పవన్ కళ్యాణ్ తన తదుపరి చిత్రం 'ఓజీ' పై దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తోంది. 'ఓజీ' సినిమా షూటింగ్ కూడా పవన్ కళ్యాణ్ బిజీ షెడ్యూల్ కారణంగా కొంత ఆలస్యమైన విషయం తెలిసిందే.

# రెట్రో లుక్ లో అంచనాలు పెంచేస్తున్న హీరోయిన్




దుల్కర్ సల్మాన్ హీరోగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరు కాంత. ఈ సినిమా నుంచి దుల్కర్ ఫస్ట్ లుక్ రిలీజై ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. 1950 నాటి స్టైల్ లో దుల్కర్ చాలా కొత్తగా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కాంత ఫస్ట్ లుక్ వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై అందరికీ అంచనాలు పెరిగాయి.

ఆ అంచనాలను ఏ మాత్రం తగ్గకుండా రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కాంత సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాపై ఇంట్రెస్ట్ ను, హైప్ ను పెంచడానికి చిత్ర యూనిట్ ఎప్పటికప్పుడు కాంత మూవీకి సంబంధించిన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఆ సినిమా నుంచి కీలక నటుల లుక్స్ ను రిలీజ్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా కాంత సినిమాలోని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే లుక్ ను రిలీజ్ చేసింది. ఇవాళ భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజు కానుకగా ఆమెకు బర్త్ డే విషెస్ తెలియచేస్తూ మేకర్స్ ఈ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో భాగ్యశ్రీ తనకు సరిగ్గా సూటయ్యే లుక్ లో ఎంతో అందంగా కనిపించింది. చీర కట్టు, గాజులు, బొట్టుతో అచ్చతెలుగమ్మాయిలా భాగ్యశ్రీ ఈ పోస్టర్ లో దర్శనమిచ్చింది. 1950 కాలం నాటి పాత్రలో భాగ్యశ్రీ భలే ఒదిగిపోయింది. కాంతలోని భాగ్యశ్రీ లుక్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

# ఆయన కారణంగానే సినిమా పాటలంటే ఇష్టం ఏర్పడింది: త్రివిక్రమ్





దివంగత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి కారణంగానే తనకు సినిమా పాటలంటే ఇష్టం ఏర్పడిందని స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. సిరివెన్నెల, త్రివిక్రమ్ మధ్య ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. సిరివెన్నెల సీతారామ శాస్త్రి గురించి త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పినంతగా ఇప్పటి వరకూ ఎవరూ చెప్పి ఉండరు. ఎందుకంటే వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం అలాంటిది. తాజాగా మరోసారి సిరివెన్నెల గురించి త్రివిక్రమ్ శ్రీనివాస్ కీలక విషయాలను పంచుకున్నారు. తాను సినీ ఇండస్ట్రీకి రాకముందు వరకూ పాటలు పెద్దగా నచ్చేవి కావని, అలాంటి సమయంలో సిరివెన్నెల సినిమాలోని 'విధాత తలపున' పాట విని మైండ్ బ్లాంక్ అయిందన్నారు. ఆ పాట తనను విపరీతంగా ఆకట్టుకుందన్నారు. అందులోని పదాలకు అర్థం వెతకడం కోసం డిక్షనరీ తిరగేశానని, తెలుగు పదాలకు కూడా డిక్షనరీ ఉంటుందని అప్పుడే తనకు తెలిసిందని అన్నారు. అయితే ఆ పాట తర్వాత సిరివెన్నెల సీతారామ శాస్త్రి రాసిన పాటలు ఎందుకో అంత గొప్పగా అనిపించలేదన్నారు. ఇప్పటికీ ఆయన రాసిన పాటల్లో 'విధాత తలపున' పాట చాలా గొప్పదిగా అనిపిస్తుందన్నారు. అందరికీ అర్థమయ్యేలా పాటలు రాయడానికి ఆయన ఎన్నో తేలికైన పదాలు వాడటం ప్రారంభించారన్నారు. అంతే కాకుండా తన సినిమాల్లోని సీన్లకు ఒక్కోసారి చాలా వెర్షన్లు రాసేవారన్నారు. జల్సా మూవీలోని 'ఛలోరే ఛలోరే' అనే పాటకు 30 వెర్షన్లు రాశారని, అందులో తాను రెండు మాత్రమే తీసుకున్నానని తెలిపారు. ఆయన అన్ని పాటలను ఒకేలా చూస్తారని, ప్రేక్షకులకు నచ్చేలా రాయడమే ఆయన గొప్పతనమని త్రివిక్రమ్ పేర్కొన్నారు.